ప్రజాశక్తి
మంగళవారం 25 జూన్, 2024
5
శ్రీకాకుళం



ఎక్కువ కేసులు రాజీ చేయాలి

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా కోర్టులో పోలీస్ అధికారులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి నుంచి శనివారం వరకు జిల్లాలోని ప్రతి కోర్టులోనూ రెండో పూట పోలీసు ల కేసులను రాజీ చేసేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఎక్సైజ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన రాజీ చేయాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ కక్షిదారులకు మంచి అవకాశమని, వారిలో అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడం ద్వారా వారికి వృథా ఖర్చుతో పాటు సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు చిన్నచిన్న రాజీ పడదగ్గ కేసులన్నీ ఈ జాతీయ లోక్ అదాలత్ వేదికగా రాజకీయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి, సీనియర్ డివిజన్ ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

'మీకోసం' ప్రారంభం

- మూడు నెలల తర్వాత మొదలైన ఫిర్యాదుల స్వీకరణ
- వినతులను స్వీకరించిన జెసి నవీన్
- సమస్యల పరిష్కారానికి తరలివచ్చిన అర్జీదారులు
- తొలి వారం 148 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎన్నికల కోడ్‌తో నిలిచిన స్పందన మూడు నెలల తర్వాత సోమవారం ప్రారంభమైంది. జడ్‌పి సమావేశ మందిరంలో జెసి నవీన్ వినతులను స్వీకరించారు. ఈ ఏడాది మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో 18న (సోమవారం) నుంచి ఫిర్యాదుల స్వీకరణను నిలిపేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వం పిరాధుల స్వీకరణకు ఇప్పటివరకు ఉన్న స్పందన పేరును మార్చి ప్రజా పిర్యాధుల నమోదు, పరిష్కార వేదిక (మీ కోసం) పేరుతో అర్జీలను స్వీకరించాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు సోమవారం 'మీ కోసం' నిర్వహించి వినతులను స్వీకరించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ వంశధార కాలువల పరిశీలన కోసం నందిగాం, పలాస పర్యటనకు వెళ్లడంతో జెసి నవీన్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు ఇతర అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి 148 అర్జీలు వచ్చాయి.

చేయూత అందించాలి

చేయూత పథకం కింద అందిస్తున్న డబ్బులు ఇప్పటివరకు తమకు రాలేదంటూ పలుగ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొందూరు మండలం లైదాం, ఎల్ఎన్‌పేట మండలం మోదుగవలస నుంచి పలువురు మహిళలు వచ్చి వినతిపత్రం అందించారు.

ఇళ్ల పట్టాలు అందించాలి

టెక్కలిలో హుదూద్ ఇళ్లు కేటాయించి నా తమకు ఇప్పటివరకు పట్టాలివ్వలేదని, తమకు పట్టాలిప్పించాలంటూ టెక్కలికి చెందిన పలువురు మహిళలు జెసి నవీన్‌కు వినతిపత్రం ఇచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తమను పాత స్థానాలకు పంపాలి

జిఎన్ఎంల కోసం నిర్వహించిన శిక్షణ పూర్తయినా తమను పాత స్థానాలకు పంపడం లేదంటూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన పలువురు జిఎన్ఎంలు మీ కోసంలో ఫిర్యాదు చేశారు. వైద్య- ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా సుమారు 220 మంది శిక్షణ పొందుతు న్నామని, ఈ ఏడాది ఏప్రిల్ 30తో శిక్షణ పూర్తి కావడంతో గత ప్రభుత్వం మరో రెండు నెలలు శిక్షణ కాలం పెంచడంతో ఈ నెల 30 వరకు కొనసాగాల్సి ఉందని వివరించారు. శిక్షణ కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్నామని, తక్కువ వేతనాలు, పిల్లల చదువుల భారంతో పట్టణాల్లో నివసించడం కష్టంగా ఉందన్నారు. వెంటనే తమ పిహెచ్‌సిలకు పంపాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి డి.సాయిప్రసాద్, ఎల్.స్వర్ణలత, ఎ.తులసీభాయి తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని వినతులు

జి.సిగడాం మండలం బాతువాలోని సర్వే నంబరు 121-2లో ఉన్న 1.59 ఎకరాల తన భూమిలో ఉన్న జీడితోటలను తన పక్క భూమి సొంతదారుడు కె.కూర్మారావు జెసిబిలతో సాయంతో తన భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నాడంటూ గ్రామానికి చెందిన టంకాల నారయణరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. కూర్మారావు అల్లులూ ఇద్దరూ పోలీసు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండటంతో బెదిరించి భూమి ఆక్రమణకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. బూర్జ మండలం తోటవాడకు చెందిన పాలవలస సూర్యనారాయణ లచ్చయ్యపేటలో తనకు వంశపారం పర్యంగా సంక్రమించిన ఎకరా 40 సెంట్లు జిరాయితీ భూమి ఉందని, దానికి 1బి ఇప్పించాలని వినతిపత్రం అందించారు. గార మండలం శ్రీకూర్మం పంచాయతీ తండాలపేటకు చెందిన గౌతు దాలమ్మ సర్వే నంబరు 144-5లో 65 సెంట్లు తప భూమిలో తొమ్మిది సెంట్లు భూమి వేరొకరి పేరున నమోదు చేశారని, దానిని సరిచేయాలని ఫిర్యాదు చేశారు. అదే మండలం వమ్మరవెల్లి పంచాయతీకి చెందిన గుజ్జల అప్పన్నమ్మ, భర్త వెంకటరావు తమకు సంబంధించిన రుణమాఫీ రూ.9,500 బ్యాంకు ఖాతాలో జమ చేయలేదంటూ వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం మండలం ఖాజీపేటకు చెందిన బందరు ఈశ్వరరావు తనకు అర్హతలు ఉన్నా వృద్ధాప్య పింఛను ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు చేశారు.

సాగునీరు అందించాలి

మందస మండలం కలింగదళ్ రిజర్వాయరు షట్టర్ల మరమ్మతులు చేయాలని, జి సిగడాం మండలం బాతువాలోని ప్రధాన చెరువును బాగు చేయాలని కోరారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను పూర్తి స్థాయిలో అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల ద్వారా రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, జిల్లా కార్యదర్శి పి ప్రసాదరావు, టి నారయణరావు, టి మోహనరంగా తదితరులు ఉన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

మీకోసం ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జెసి ఎం.నవీన్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పిర్యాదుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. ప్రజల నుంచి అర్జీల్లో ఏవీ పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహనరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, కెఆర్‌ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఇరిగేషన్ ఎస్ఇ రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో బిఆర్ఎయు

నేడు 17వ ఆవిర్భావ దినోత్సవం

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీలో ఎయూ పిజి కేంద్రంగా తన ప్రస్థానం ప్రారంభించి 2008 జూన్ 25న పూర్తిస్థాయి విశ్వవిద్యాలయంగా మారింది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ. అంచెలంచెలుగా అభివృద్ధి పథంలో పయనిస్తూ అటు గ్రామీణ, ఇటు గిరిజన ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తూ, వారి ఉన్నతకు అన్ని విధాల తోడ్పాటును అందించేందుకు వర్సిటీ ప్రయత్నిస్తోంది. ఈ నెల 25న ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నారు.

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజిని మార్గదర్శకంలో నాణ్యమైన ఉన్నత, సాంకేతిక విద్యను అందిస్తూ రాష్ట్రంలో పలు విద్యాసంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. ఎన్నో విజయాలను సాధించి, మరెన్నో మైలురాళ్లను దాటి 17వ వసంతంలోనికి అడుగుపెట్టింది. ఈ 16 ఏళ్లలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ మరన్ని వసతులు కల్పనకు బిఆర్ఎయు పెద్దపీట వేసింది.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ నాక్ గ్రేడింగ్‌ను 2021 అక్టోబరు 5న బిఆర్ఎయు సాధించింది. 2017లో ఎన్ఐఆర్ఎఫ్‌తో ఉత్తమ ర్యాంకింగ్‌ను పొందింది. 2019లో యుజితో 12(బి) గుర్తింపును సాధించింది. అదేఏడాది ప్రభుత్వ రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల కేటగిరిల్లో జాతీయ స్థాయిలో 4వ స్వచ్ఛ కేంపస్‌గా నిలిచింది. 2020 ఆగస్టులో ఉన్నత భారత్ అభియాన్ అవార్డు లభించింది. అనతికాలంలోనే వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎఐసిటియు గుర్తింపును పొందింది.

మరోవైపు ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో పలు నూతన కోర్సులకు శ్రీకారం చుట్టారు. నాలుగేళ్ల సమీకృత విద్యా కార్యక్రమం (ఐటిఇపి) కోర్సును ఇప్పటికే ప్రారంభించింది. 5వ ఏపి సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు, దక్షిణ భారత మహిళల ఖోఖో పోటీలు, క్లాస్ రూమ్ టూ కామన్ మేన్ కార్యక్రమం, సామాజిక అనుసంధాన సేవా కార్యక్రమాలు గతంలో విజయవంతంగా నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా డిగ్రీస్థాయిలో ప్రారంభించిన 'మ్యాండెటరీ ఇంటెర్న్‌షిప్' పోగ్రామ్లో రాష్ట్రంలోనే పూర్తిస్థాయి అమలు చేసి తొలి జిల్లాగా శ్రీకాకుళం, తొలి విశ్వవిద్యాలయంగా అంబేద్కర్ యూనివర్శిటీ నిలిచింది. విద్యార్థుల ప్రయోజనార్థం 'డయల్ యువర్ యూనివర్సిటీ' కార్యక్రమం, ఆన్‌లైన్ ఫేమెంట్ సిస్టమ్, డిజిటల్ లాకర్ సిస్టమ్ వంటివి అమలు చేయడంలో ముందుంది. జిల్లా భవిష్యత్ కోసం ఏర్పడిన, ఏర్పడుతున్న పలు పరిశ్రమలు, ప్రాజెక్టులకు అనుగుణంగా పలు పిజి డిప్లొమో, సైన్స్ కోర్సులను ప్రారంభించింది.



అధునాతన వసతులు

విద్యార్థులకు సౌకర్యవంతమైన, ఆరోగ్యదాయకమైన, విజ్ఞానదాయకమైన కేంపస్ జీవితాన్ని అందించేందుకు ఎప్పటికప్పుడు మరిన్ని వసతులు, నూతన నిర్మాణాలు సమకూర్చుకుంటున్నది. విశాలమైన బోధనా తరగతి గదులు, అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు, పరిశోధనలకు అనువైన లేబొరేటరీలు, విజ్ఞానపు ప్రపంచాన్ని పరిచయం చేసే గ్రంథాలయాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు వంశధార, నాగావళి. మహేంద్రతనయ తదితర పేర్లతో పలు హాస్టల్స్ వసతి వర్సిటీ కల్పిస్తోంది. 350 మందికి వసతి కల్పించే ఆధునాతన బాలుర హాస్టల్ కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. మరోవైపు ఆధునిక అల్ట్రా మెడరన్ కిచెన్ అందుబాటులో ఉంటూ నాణ్యమైన, రుచికరమైన భోజన సౌకర్యం కలిగి కల్పించి మంచి గుర్తింపు తెచ్చుకుంది.

నాక్ ఉత్తమ గ్రేడింగ్‌కు ప్రయత్నం



వర్సిటీలో బోధన, పరిశోధనల్లో నాణ్యత పెంచుతూ పాలన, సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేయన్నాం. నాక్ ఉత్తమ గ్రేడింగ్‌ను సాధించే దిశగా ప్రణాళిక రూపొం దిస్తున్నాం. సామాజిక న్యాయానికి, అవనీతి రహిత వర్సిటీకు ప్రాధాన్యత ఇస్తున్నాం. బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల సమస్య దశాబ్దన్నరగా వేధిస్తుంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కారిస్తా.

– కె.ఆర్.రజని, వైస్ ఛాన్సలర్, బిఆర్ఎయు

శివారు భూములకు సాగునీరు

కలెక్టర్ మనజీర్ జిలానీ నమూన్



వివరాలు సేకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలాస

వంశధార కాలువ నుంచి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ మనజీర్ జిలానీ నమూన్ అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి టెక్కలిపట్నంలోని వంశధార కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్‌కు వంశధార కాలువ వరిస్థితిని వివరించారు. గత నాలుగేళ్లుగా వంశధార కాలువలో కనీసం పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టకపోవడంతో నియోజకవర్గంలోని చుక్కనీరు అందించలేని దుస్థితికి చేరుకుందన్నారు. దీనివల్ల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అందుకోసం ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లోనైనా శివారు భూములకు సాగునీరు అందించాలని కృషి చేస్తున్నామని అన్నారు. ఈ ఉద్దేశంతో ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు తానూ కాలువ వనులు వరిశీలించామన్నారు. యుద్ధప్రాతివదికన పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశించామన్నారు. అలాగే షట్టర్లు మరమ్మతులకు, వంశధార వనులకు నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వనులు వారం రోజుల్లో పూర్తి చేయాలని వంశధార అధికారులకు ఆదేశించారు. ఈ ఏడాది శివారు భూములకు నీరు అందించేందుకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వంశధార ఎస్ఇ రాంబాబు, ఇఇ శేఖర్, డిఇ శ్రీకాంత్, ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, ఎంపిడిఒ ఎం.వైకుంతరావు, నీటి సంఘం మాజీ చైర్మన్ ముల్లా బాలకృష్ణ, టిడిపి నాయకులు విఠల్‌రావు పాల్గొన్నారు.

నందిగాం : వంశధార కాలువ శివారు భూములకు సాగునీరు అందించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని వంశధార అధికారులకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. మండలంలోని సుభద్రాపురం, కణితూరు వద్ద వంశధార కాలువలను పరిశీలించారు. ప్రత్యేక నిధులతో పనులు చేపట్టాలన్నారు. సుభద్రాపురం వద్ద రైతు కె.తాతయ్యతో పాటు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించాలని కలెక్టర్‌ను కోరారు. ఈయనతో పాటు వంశధార అధికారులు ఉన్నారు.

ఎంపీల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీకాకుళం, విజయనగరం ఎంపీలు కింజరాపు రామ్మోహననాయుడు, కలిశెట్టి అప్పలనాయుడులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంటు సెంట్రల్ హాల్లో 18వ లోక్‌సభ కొలువు తీరిన వేళ వీరి చేత ప్రోటెం స్పీకర్ భతృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కేంద్ర పౌర విమాన యానశాఖ మంత్రిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ నాయుడు పార్లమెంట్ హాల్లో తెలుగులో ప్రమాణస్వీకారం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ఢిల్లీలోనే సైకిల్‌పై వెళ్లి టిడిపిపై తనకున్న విధేయతను చాటుకున్నారు.



పమాణస్వీకారం చేస్తున్న రామ్మోహన్ నాయుడు,



సైకిల్‌పై వెళ్తున్న అప్పలనాయుడు

ప్రజా సొమ్ముతో ప్యాలస్‌లా?

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ప్రాంతంలో గడచిన ఐదేళ్లలో రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని మాజీ సిఎం జగన్, మంత్రులు లూఠీ చేసి, ప్రజల సొమ్ముతో ప్యాలస్‌లు ఎలా నిర్మిస్తారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి నియంతృత్వపు పోకడలు, పెద్దఎత్తున అవినీతి, ప్రజల స్వేచ్ఛను హరించడం వల్లే ప్రజలు ఆయనకు గుణపాఠం చెప్పారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలు ఒక భాగం మాత్రమేనని పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు జిల్లా నుంచి మంత్రిగా పనిచేసిన సీదిరి అప్పలరాజు కళ్లు లేని కబోదిగా వ్యవహరించారన్నారు. భవనాల కూల్చి వేతపై మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. జిల్లాలో గత ప్రభుత్వంలో ఇద్దరు మంత్రులు, స్పీకర్ ఉండి కూడా రోడ్లు వేసుకోలేకపోయారని అన్నారు. నదుల అనుసంధానం, వంశధార, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారన్నారు. ఆర్భాటంగా ప్రారంబించిన తాగునీటి ప్రాజెక్టు ఎన్ని గ్రామాల్లో తాగునీరందిస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. నదుల అనుసంధానం టిడిపి హయాంలో 70 శాతం పనులు పూర్తయితే, మిగిలిన 30 శాతం వైసిపి ఎందుకు పూర్తి చేయలేకపోయారని పశ్నించారు. మంచి చెస్తే ఓటెయండి అని జగన్ చెప్పిన మాటకే ప్రజలు కట్టుబడ్డారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ఇదొక గుణపాఠంగా జగన్ స్వీకరించాలన్నారు. ఇప్పటికీ ఓటమిని జీర్ణించుకోలేకే చట్టసభలో స్పీకర్‌ను తన సీట్లో కూర్చోబెట్టే సంప్రదాయానికి జగన్ ఎందుకు విస్మరించారో ప్రజలకు చెప్పాలన్నారు. విశాఖ రుషికొండ ప్యాలెస్‌లో ఒక్క బెడ్ రూమ్ ఇరవై సెంట్లలో కట్టి... ప్రజలకు మాత్రం సెంటు జాగా ఇచ్చి ఇళ్లు కట్టామని చెప్పారని గుర్తు చేశారు. ఆయనకు జీ హుజూర్ అంటూ ద్వివేది వంటి సీనియర్ ఐఎఎస్‌లు పని చేశారని, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో పనిచేసిన ఆయన పంచాయతీ నిధులు దారిమళ్లింపులోను, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా న్యాయస్థానానికి సైతం తప్పుడు నివేదికలు ఇచ్చారని, ఆయనపై క్రిమనల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వానికి కోరారు.



విద్యాహక్కు చట్టానికి తూట్లు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని నారాయణ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పుస్తకాలు, యూనిఫారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ఆరోపించారు. సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ సంస్థ ఆవరణలో పుస్తకాలను యూనిఫారాలను నారాయణ విద్యాసంస్థల్లో విక్రయిస్తుంచారని తెలిపారు. పుస్తకాలు, యూనిఫారాల విక్రయాల్లో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 15 నుంచి రూ.20 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులపై ఇది పెనుభారంగా మారుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో విద్యాశాఖ అధికారులపై అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యాశాఖ తీరును నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్ తిరుపతి, కమిటీ సభ్యులు యశ్వంత్, భూపతి సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీష్

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

శ్రీకాకుళం అర్బన్ : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించవచ్చని టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. మూడు రోజులుగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిశాయి. నగరంలోని పెద్దరెల్లివీధికి చెందిన జైబీమ్ శబరి ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పోటీల్లో 34 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన శ్రీకాకుళం టీం క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాదారపు డేవిడ్, ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

కసాయి భర్తను కడతేర్చిన భార్య

- గతంలో అనుమానంతో వేధింపులు
- అడ్డుకున్న కుమారుడిని హతమార్చాడని పెంచుకున్న కక్ష

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కన్న కొడుకును హతమార్చాడన్న కోపం.. గతంలో తననే అనుమానిస్తూ వేధించేవాడన్న కక్ష కలిసి భర్తనే హత్య చేసేందుకు ఓ భార్యను ప్రేరేపించాయి. ఫలితంగా కొండ్ర కుప్పయ్య (55) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. చాన్నాళ్ల తర్వాత ఇంటికి వచ్చిన అతను భార్య చేతిలోనే హతమారిపోవడం విషాదం. ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ దారుణానికి సంబంధించి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పిలికి చెందిన కుప్పయ్య ఆదివారం రాత్రి ఇంటి శ్లాబ్‌పై నిద్రిస్తున్న సమయంలో అతని భార్య హరమ్మ (51) అర్ధరాత్రి సమయంలో కత్తితో అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత నిందితురాలు నేరుగా పోలీస్‌స్టేషన్ వెళ్లి లొంగిపోయింది. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఏడాది క్రితం కొడుకును చంపిన తండ్రి

కుప్పయ్య, హరమ్మలకు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఒక కుమార్తె అప్పాయమ్మకు వివాహమై అదే ఊళ్లోని అత్త వారింట్లో ఉంటోంది. కాగా, కుప్పయ్యకు భార్య ప్రవర్తనపై గతం నుంచీ అను మానం ఉండేది. పలుమార్లు ఆ విషయంలో భార్యను నిలదీసి, గొడవలు పెట్టినా సొంత కుటుంబ సభ్యులు, ఊరిపెద్దలు తన భార్య హరమ్మనే సమర్థిస్తూ... తనను మందలించడాన్ని తట్టుకోలేకపోయాడు. దాంతో కుటుంబం మొత్తాన్ని అంతం చేయాలనుకున్నాడు. సరిగ్గా ఏడాది క్రితం జూన్ 27న అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో కుప్పయ్య సరుగుడు తోటలు నరికే కత్తితో తొలుత పెద్ద కుమారుడు తాతారావుపై దాడి చేసి నరికేశాడు. ఈ అలికిడికి మెలకువ వచ్చిన మిగతా కుటుంబ సభ్యులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా... ఏమాత్రం వెనక్కి తగ్గని కుప్పయ్య రెండో కొడుకు కామరాజుపైనా దాడి చేసి గాయపరిచాడు. దాంతో భయాందోళనతో మిగతావారు కేకలు పెట్టడం, చుట్టుపక్కల వారు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో కుప్పయ్య పారిపోయాడు. రంగంలోకి దిగిన పోలీసులు కొద్దిరోజుల్లోనే అతన్ని అరెస్టు చేసి జైలులో పెట్టారు.

పండగలకు వచ్చి..

కేసు విచారణలో ఉండగానే కుప్పయ్య కొన్ని నెలల క్రితం బెయిల్‌పై విడుదలయ్యాడు. కానీ, స్వగ్రామమైన కుప్పిలికి వెళ్లకుండా, కుటుంబాన్ని పట్టించుకోకుండా శ్రీకాకుళం నగరంలోని కూలీ పనులు చేసుకుంటూ గడపసాగాడు. ఈ తరుణంలో ఇటీవల కుప్పిలిలో 16 ఏళ్లకోసారి జరిగే అసిరితల్లి అమ్మవారి పండగలు మొదలయ్యాయి. ఆ ఉత్సవాల్లో పాల్గొనేందుకు కుప్పయ్య స్వగ్రామానికి వచ్చి, సొంత ఇంట్లోనే ఉండటం ప్రారంభించాడు. అయితే పండగలు పూర్తయినా కుప్పయ్య ఇంటి నుంచి కదలకపోవడాన్ని భార్య హరమ్మ ప్రశ్నించింది. తాను శ్రీకాకుళం తిరిగి వెళ్లనని, ఇక్కడే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటానని కుప్పయ్య స్పష్టం చేశాడు. గతంలో అనుమానాలతో తనను వేధించడం, అభ్యంతరం చెప్పిన కుమారుడిని హతమార్చాడన్న కారణంతో భర్త తమతో కలిసి ఉండటం హరమ్మకు ఇష్టం లేదు. దాంతో అర్ధరాత్రి నిద్రిస్తున్న కుప్పయ్యపై కత్తితో దాడి చేసి హతమార్చింది. స్వయంగా వచ్చి లొంగిపోయిన హరమ్మ ఇచ్చిన సమాచారం ప్రకారం జె.ఆర్.పురం సిఐ రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది కుప్పిలి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించార వివరాలు సేకరించిన అనంతర మృతదేహాన్ని పోస్టుమా ర్టానికి పంపించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర శివారుల్లో ఉన్న పెద్దపాడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9 తరగతుల వరకు మిగులు సీట్లు భర్తీ చేస్తున్నట్టు ప్రిన్సిపాలగ్ మార్పు జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను భర్తీ చేసేందుకు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 29న ప్రవేశ పరీక్ష నిర్వమిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మంత్రి మనోహర్‌ను కలిసిన విఆర్ఎల సంఘం సభ్యులు

మంత్రిని కలిసిన విఆర్ఎలు

ప్రజాశక్తి- పొందూరు

గ్రామ రెవిన్యూ సహాయకుల (విఆర్ఎ) సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు తెండేల త్రినాధరావు సోమవారం రెవిన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లను కలిసి వినతిపత్రం అందించారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రులను మర్యాదపూర్వకంగా సంఘ సభ్యులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత కలిగిన విఆర్ఎలకు విఆర్ఓలుగా పదోన్నతి కల్పించాలని, నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్ఏలుగా గుర్తించాలని కోరారు. తెలంగాణా రాష్ట్రంలో విఆర్ఎలకు అమలవుతున్న జిఒలను మంత్రులకు వివరించి అందజేశారు. మంత్రులను కలిసిన వారిలో రాష్ట్ర విఆర్ఎ సంఘం నాయకులు షేక్ బందగీ సాహెబ్, కె.రవికుమార్, జి.వెంకన్న తదితరులున్నారు.

టిటిడికి చేపేనపేట బెల్లం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేట, నిమ్మ తొర్లావాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న చెరుకు నుంచి తయారుచేసిన బెల్లాన్ని ప్రకృతి వ్యవసాయ విభాగం డిపిఎం రేవతి సమక్షంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి మాట్లాడుతూ చేపేనపేట, నిమ్మతొర్లావాడ గ్రామాల నుంచి పది టన్నుల బెల్లాన్ని తిరుపతి దేవస్థానానికి పంపించడం జరిగిందన్నారు. ఈ ఏడాది రెండు దఫాలుగా 20 టన్నుల బెల్లాన్ని ఇక్కడ నుంచి తిరుపతి దేవస్థానానికి పంపించడం జరిగిందన్నారు. నిమ్మతొర్లాడలో నక్క దామోదరరావు అనే రైతు పూర్తిగా తనకున్న వ్యవసాయ భూమిలో ప్రకృతి సేద్యంలో చెరుకు పంటను సాగు చేస్తూ మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మారుమూల గ్రామం నుంచి ప్రకృతి సేద్యంలో తయారుచేసిన పంటలను రాష్ట్ర నలుమూలలకు ఎగుమతి చేయడం వలన రైతులకు అదనపు ధర వచ్చి మంచి ఆదాయం కూడా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ సిబ్బంది, ఎన్ఎఫ్ఎ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ శివాజీ, మాస్టర్ ట్రైనర్ శోభన్, చిరంజీవి, తిరుపతిరావు, లక్ష్మి కృష్ణవేణి, జానకిరామ్, గ్రామ సర్పంచ్‌లు సత్యరాజ్, ఉదయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, పేదరికం చదువుకు అడ్డు కాకూడదని చిక్కోలు పక్కా లోకల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాయితీ శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పుణ్యపువీధికి చెందిన దేవ్ గాయత్రికి ఉన్నత చదువులకుగాను ట్రస్ట్ ద్వారా రూ. 25 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేసారు. ఇంటర్మీడియట్‌లో 970 మార్కులు సాధించిన గాయత్రి ఐఐటి, ఎన్ఐటిలో చేరేందుకు ఆసక్తి చూపుతోంది. ఆర్థికస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో ఆమె దాతలసాయాన్ని కోరుతోందని తెలుసుకున్న శ్రీనివాసరావు తనవంతు రూ.25వేలు అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న రాజేష్

ముళ్లపొదలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ప్రధాన, గ్రామీణ ప్రాంతాల రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన ముళ్ళపొదలను తక్షణమే తొలగించాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి లోల్ల రాజేష్ కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కవిటి - ఈదుపురం, కవిటి - రాజపురం, కవిటి - సోంపేట, కవిటి - శిలగాం, కవిటి - బొరివంక ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పొదలు, చెట్లతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్టు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మండల అధికారులు తక్షణమే వాటిని తొలాగించే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిటి టి.రామచంద్రరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, జనసైనికులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: నిరుపేద ఒంటరి మహిళకు నిత్యావసర సరుకులను కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ అందజేసి మరోమారు తన ఉదారతను చాటుకుంది. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్ (సురేష్) పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యాన నిరుపేద ఒంటరి మహిళ కృష్ణవేణి అనే వృద్ధురాలికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ సీపాన రమేష్ కుమార్, కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ సభ్యులు సీపాన అప్పల నాయుడు, కూన త్రినాథ్, పూజారి రామ్మూర్తి, పోలినాయుడు, శ్రీకాంత్, ప్రకాశరావు, అప్పలనాయుడు, మహేష్, జగదీష్, కృష్ణారావు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

కవిటి: మండలంలోని కొత్తపుట్టుగకు చెందిన క్షతగాత్రుడు సప్ప సిద్ధుకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ అండగా నిలిచింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధు తీవ్రంగా గాయపడ్డాడు. మోచేయి బాగా దెబ్బతినడంతో ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పారు. ఇకెవైసి లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించలేదు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని సిద్ధు కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఫౌండేషన్ సంస్థ సభ్యులు సోమవారం విశాఖలోని ఆస్పత్రికి చేరుకుని తక్షణ సహాయంగా సిద్ధుకు రూ.20వేలు అందజేశారు.

టెక్కలి : మండలంలోని అక్కవరానికి చెందిన వంజంగి రాజన్న కుటుంబానికి సర్పంచ్ పొట్లూరు భూలక్ష్మి సోమవారం ఆర్థికసాయాన్ని అందించారు. రాజన్న కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు కలిపి రూ.2.2 లక్షలు విరాళాన్ని పోగు చేశారు. ఈ విరాళాన్ని రాజన్న కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అప్పలనాయుడు, గుంట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంపుహౌస్‌లో క్లోరినేషన్

ప్రజాశక్తి- నౌపడ

పంచాయతీ సిబ్బంది ఆయా పంచాయతీల్లోని పారిశుధ్యం, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులపై దృష్టిసారించాలని, తరచూ పారిశుధ్య పనులు చేయించాలని డిఎల్‌పి ఐ.వి.రమణ ఆదేశించారు. సంతబొమ్మాళి మండలం నౌపడ పంపుహౌస్‌ను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. అనంతరం ఇజ్జువరం పంచాయతీలో కాలువలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ముక్కి రవికుమార్, ఉప్పాడ ఉమాపతి, ఇంజినీరింగ్ అధికారులు అనంత్, ఖాన్ బిల్ కలెక్టర్ రంజిత్, వాటర్ బాయ్ శేఖర్ పాల్గొన్నారు.


క్లోరినేషన్ చేయిస్తున్న డిఎల్‌పిఒ రమణ

రైతు సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- లావేరు

రైతు సంక్షేమమే ధ్యేయంగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పనిచేస్తుందని ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. సోమవారం లావేరు సచివాలయం-2లో రాయితీపై ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రైతులు నిరాదరణకు గురయ్యారని, ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు విత్తనాలు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు రాయితీపై అందజేసి రైతులకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. రైతులు కోరుకునే విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఇప్పటికే ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అధికారులకు ఆదేశించారన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించి పంట దిగుబడులకు దోహదపడాలని సూచించారన్నారు. కార్యక్రమంలో విఎఎ ప్రమిలా, నాయకులు లంకలపల్లి శ్రీను, జగన్నదొర, నిదిగంటల త్రినాథ్, గురిజా శ్రీను, రాంబాబు, మాలచ్చి, రమేష్, రవి, రైతులు పాల్గొన్నారు.


లావేరు : రైతులకు విత్తనాలు అందజేస్తున్న తోటయ్యదొర తదితరులు

పొందూరు: మండలం కృష్ణాపురంలో సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు చేతులు మీదుగా సోమవారం రైతులకు వరివిత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైడినాయుడు, సింహాచలం, సురేష్, నర్శిమూర్తి, గురునాథం, ఆదినారాయణ, జనసేన జిల్లా కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు గార బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పనిలో పెడితే చర్యలు

కోటబొమ్మాళి: చిన్నారులను పనుల్లో పెట్టరాదని, అలా పెట్టినవారిపై చర్యలు తప్పవని టెక్కలి సహాయ కార్మిక అధికారి ఆర్.రాధాకుమారి, జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ డి.సీతారాములు, ఎంఇఒ ఎస్.అప్పలరాజులు హెచ్చరించారు. చైల్డ్ ఆర్ఎంటిలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు సంయుక్తంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే దుకాణాలు, హోటళ్లకు వెళ్లి బాలలను పనిలో పెట్టరాదని సూచించారు. పిల్లలందరూ బడికి వెళ్లి చదువు అభ్యసించి, వారి భవిష్యత్‌కు చక్కటి మార్గాలు వేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు పేదరికం, ఇతర కారణాల వాళ్ల పిల్లలను పనిలో పెట్టరాదని, బడిఈడు పిల్లలను పాఠశాలకు మాత్రమే పంపాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ప్రతినిధి నాయుడు, హెచ్‌సికె గణేష్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

సరుబుజ్జిలి : బడిఈడు పిల్లలు బయట తిరగకుండా బడిలో చేరేలా ఎంఇఒలు కె.శ్రీనివాసరావు, డి.బాలరాజులు తెలిపారు. మండలంలోని కొత్తకోటలో బడికి పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వ శిక్షా అభియాన్ ఆదేశాల మేరకు జూలై 12 వరకు ఈ కార్యక్రమం ద్వారా బడిబయట ఉన్న పిల్లలను గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, సిఆర్ఎంటిలు చిన్నారావు, చిరంజీవి, రోహిణి, రామినాయుడు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ముఖాముఖి మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఫిర్యాదులపై చట్టపరమైన విచారణ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (మీకోసం) ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణ చేపట్టి న్యాయం చేస్తామని బాధితులకు ఎస్‌పి జి.ఆర్.రాధిక భరోసా కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా పోలీసు అధికారులకు చెప్పి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మీ కోసం ద్వారా వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక పంపించాలని ఆదేశించారు. మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో మోసపూరితమైన నేరాలకు సంబంధించి రెండు, ఆస్తి నేరాలపై ఒకటి, మిస్సింగ్ కేసులపై మూడు వచ్చాయి. కుటుంబ తగాదాలపై ఆరు, సివిల్ సంబంధిత అంశాలపై 12, ఇతరత్రా అంశాలపై 10 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వర బాధితుల వద్ద నుంచి ఫిర్యాదుల స్వీకరణలో పాల్గొన్నారు.

'నీట్'పై విచారణ చేపట్టాలి

టెక్కలి : దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై, పేపర్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు తలసముద్రం సూర్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షనే రద్దు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కూరాకుల యాదవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చివేత

ఇచ్ఛాపురం: పట్టణంలో 23 వార్డులోని బెల్లుపడ కాలనీ ముఖద్వారం వద్ద సొంత డబ్బులతో గోతులను కప్పించిన వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్‌కుమార్ సేవలకు పలువురు అభినందించారు. బెల్లుపడకాలనీలో మొదటలైన్ లో రోడ్డుకి గోతులు ఏర్పడ్డాయి. కాలనీ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడడం గమనించి కౌన్సిలర్ ప్రదీప్ కుమార్, వ్యాపారవేత్త గవరయ్య, అయ్యప్ప, చిన్ని, దిలీప్, యువకులు చొరవతో సొంత ఖర్చులతో రోడ్డుపై మట్టి వేశారు.

లోవోల్టేజీతో అవస్థలు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ జోగ త్రివేణిమల్లి కోరారు. విద్యుత్ ఎఇ వివేకానందను సోమవారం కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ ఐదేళ్లుగా తమ వార్డులో లోవోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసి, కాళ్ల అరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదన్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో తమ లోవోల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందనే ఉద్దేశంతో మరోమారు అధికారులకు వినతిపత్రం అందిస్తున్నామని తెలిపారు.

భూ కబ్జాదారులపై చర్యలు

మందస: అధికారులు మీమీ ఉద్యోగ బాధ్యతలను పక్షపాత వైఖరి లేకుండా, ఎవరికీ భయపడకుండా సక్రమంగా నిర్వర్తించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తిరుమలబాబు అధ్యక్షతన సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ పరిపాలన వలే కాకుండా అర్హులందరికీ సంక్షేమం పథకాలు అందించడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తామన్నారు. తప్పుడు ధ్రువపత్రాలతో అర్హత లేకుండా సంక్షేమ పథకాలు పొందుతున్న వారి వివరాలు చెప్పి మరీ తీసివేస్తామన్నారు. కొండలు, గుట్టలు మింగేస్తున్న గత ప్రభుత్వ హయాంలో అధికారులకు చర్యలు తీసుకునే స్వేచ్ఛ లభించలేదన్నారు. అధికారులు ఎవరికీ భయపడకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. మందస మండలంలో భూముల కబ్జాలపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, భూ కబ్జాలదారులపై చర్యలు తప్పవని, సాక్ష్యాలతో సహా త్వరలోనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

సమర్థవంతంగా పనిచేయాలి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ఇటీవల కొత్తగా ఎన్నికైన బయాలజికల్ సైన్స్ టీచర్స్ ఫోరమ్ కార్యవర్గం సైన్స్ అభివృద్ధికి సమర్థవంతంగా కృషి చేయాలని జిల్లా విద్యా శాఖధికారి కె.వెంకటేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారిణి ఆర్.విజయకుమారి సూచించారు. సోమవారం నూతన కార్యవర్గం డిఇఒ, డెప్యూటీ డిఇఒలను వారి వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నూతన కమిటీని వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సైన్స్, శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. అధ్యక్షుడు పుట్టా ఉదయ కుమార్, ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, గౌరవ అధ్యక్షుడు కవిటి కుమార్, స్టేట్ మెంబెర్ గొంటి గిరిధర్, జి.మోషే పాల్గొన్నారు.

డి.జి.పురం విద్యార్థులకు అభినందనలు

నౌపడ: సంతబొమ్మాళి మండలం డి.జి.పురం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎస్ఇఎంఎస్ ఒలింపియాడ్ ప్రతిభ పరీక్షలో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జోనల్ స్థాయి ర్యాంకులు పొందారు. ఈ మేరకు పురస్కారం అందుకున్న విద్యార్థులు ఎ.కీర్తన, ఐ.దీపిక, బి.కామేశ్వరరావు, బి.ఆకాంక్ష, ఎస్.కీర్తన, డి.నవమనోజ్ఞలను డిఇఒ కె.వెంకటేశ్వరరావు సోమవారం సత్కరించి అభినందించారు. హెచ్ఎం కోత చైతన్య చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, లక్ష్మి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


నౌపడ : అభినందిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రభుత్వ భూముల వివరాలు అందించాలి

పలాస: మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలు, వాటిలో కబ్జాలకు గురైన వివరాలను తక్షనమే తమకు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. తన కార్యాలయంలో ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను సోమవారం కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాశీబుగ్గ ఆర్ఒబి నిర్మాణంలో ఎంత మందికి పరిహార లభించాయి. ఇంకా ఎంతమందికి పరిహారం అందించాల్సి ఉంది. నిర్వాసితులు ఎంతమంది వారికి స్థలాలు ఎక్కడ కేటాయించారు. తదితర వివరాలు తెలియజేయాలన్నారు. గృహ నిర్మాణానికి గ్రామాల వారిగా కేటాయించిన భూముల వివరాలు, అందులో ఎన్నిచోట్ల నిర్మాణాలు జరిగాయి... కోర్టు లావాదేవీలో ఉన్న వివరాలు కూడా తెలియ జేయాలన్నారు. రేషన్ బియ్యం పంపిణీ, వాహనాలు, దుకాణాల వివరాలు తెలియజేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ పాలనలో అక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాల వివరాలు తెలియజేయాలన్నారు. విలేకరులకు అందించిన పట్టాల పంపిణీలో అవకతవలకుపై దృష్టి సారించాలని సూచించారు. బొద్దపాడు రెవెన్యూ పరిధి టిడ్కో గృహాల వెనుక ఉన్న ప్రభుత్వ భూముల్లో గత ప్రభుత్వం ప్రతిపాదిన టౌన్ షిప్ వివరాలు అందించాలన్నారు. తహశీల్దార్ వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి, టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న సంఘ నాయకులు

ఎమ్మెల్యే దృష్టికి సొండిల సమస్యలు

కవిటి: సొండిలకు న్యాయం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె.బి.చౌదరి కోరారు. మండలంలోని రామయ్య పుట్టుగలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పాత అబ్కారీ విధానానికి స్వస్తిచెప్పి ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించడంతో తమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కనీసం తమకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలూ కల్పించలేదని అన్నారు. సొండిలకు కార్పొరేషన్ కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఒబిసి జాబితాలో చేర్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి.రాజారావు, కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు, మొగిలిపురి సింహాచలపతి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- పొందూరు

మండలం తండ్యాం పంచాయతీ శ్రీరామనగర్ కాలనీ(తండ్యాం మెట్ట)లోని దుర్గగుడిలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లి పగులగొట్టి నగదును చోరీ చేసి సమీపంలోని పొలంలో హుండీని వదిలేశారు. హుండీలో సుమారు రూ.30వేలు నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


మృతి చెందిన మేక పిల్లలు

ఐదు మేక పిల్లలు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని తిర్లంగిలో సోమవారం ఐదు మేక పిల్లలు మృతి చెందారు. గ్రామానికి చెందిన బుడ్డ అప్పన్న, సారిపల్లి అప్పల్లుడుకు చెందిన 20 మేక పిల్లలు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. వాటిలో ఐదు మేక పిల్లలు మృతి చెందగా, మరో 15 పిల్లల పరిస్థితి విషమంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న పశుసంవర్ధకశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మేక పిల్లలను పరిశీలిస్తున్నారు. మేక పిల్లల రక్తం నమోనాలు సేకరించి లేబొరేటరీకి పంపినట్లు తెలిపారు. సంఘట స్థలాన్ని మాజీ సర్పంచ్ దవళ రామచంద్రరావు, యాదవ సంఘం అధ్యక్షుడు ఇప్పిలి జగదీష్‌లు బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజాపక్షాన పోరాటం

ప్రజాశక్తి- పాతపట్నం

కూటమి ప్రభుత్వం ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇచ్చిందని, ప్రతి హామీలు అమలు చేయకపోతే ప్రజా పక్షాన పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల కార్యకర్తలు, నాయకులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

వజ్రపుకొత్తూరు : రైతన్న సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గోవిందపురం రైతు భరోసా కేంద్రంలో గోవిందపురం, గోపినాథపురం పంచాయతీ రైతులకు సోమవారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్నీ రమణ, మదనాల జోగారావు, వైస్ సర్పంచ్ గుంట సత్యం, మండల ఎఒ కుసుమకుమారి, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

టిడిపితోనే మహిళలకు రక్షణ

ప్రజాశక్తి- లావేరు

టిడిపి ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ, భద్రత ఉంటుందని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత సురేష్ అన్నారు. సోమవారం తాళ్లవలసలో విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఈపురు పాలెంలో మహిళపై అత్యచారం జరగ్గా రాష్ట్ర హోంమంత్రి అనిత నేరుగా సంఘటన జరిగిన గ్రామానికి వెళ్లి సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి 48 గంటల్లోనే నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రూ.పదిలక్షలు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదు కోవడం జరిగిందన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీమామిత్రలు

బీమామిత్రలను ఆదుకోవాలి

ఇచ్ఛాపురం: వైసిపి ప్రభుత్వం తమని బీమామిత్రలను అకారణంగా తొలగించి రోడ్డుపైకి తీసుకొచ్చిందని, తమని ఆదుకోవాలి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజులను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. చంద్రన్న బీమా పేరు ఉన్న కారణంగా తమకు సమాచారం ఇవ్వకుండా అర్థాంతరంగా తొలగించారన్నారు. ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగలం పాదయాత్రలో విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో సిహెచ్.సునీత పట్నాయక్, ఎల్.గీత, బి.కుమారి, బి.వి.కుసుమ, వి.శ్రీదేవి పాల్గొన్నారు.

'మీకోసం'లో పలు వినతులు

కొత్తూరు : ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు అధ్యక్షతన సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపిపి తులసీ వరప్రసాదరావు స్థానిక కళాశాల సమీపంలో రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తుందని, దీనిని శుభ్రం చేయించాలని విన్నవించారు. నివగాం రోడ్డు ఎస్‌సి వీధి వద్ద కూడా మురుగు సమస్య తీవ్రంగా ఉందని, నేరడిలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్య ఉందని, విద్యుత్‌శాఖాధికారులు స్పందించి సరి చేయాలని కోరారు. కె.సంజీవరావు, జి.గోవిందరావు, నిమ్మక రామకృష్ణ, మల్లేష్, పి.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బెలమాం, లొద్దలపేట గ్రామాల్లో సర్పంచ్ కనుగుల కిషోర్ ఆధ్వర్యంలో వీధుల్లోని మురికి కాలువల్లో ఉన్న చెత్తను తొలగించి పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. సోమవారం వీధుల్లోని కాలువల్లో చెత్తను తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. అలాగే గ్రామంలోని రహదారులపై నిలిచిన నీటిని తొలగించి దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌ను చల్లారు. సర్పంచ్ కిషోర్ మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలమని అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించడం జరిగిందన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువలను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. బోర్‌వెల్ ప్లాట్ ఫారం వద్ద వీధుల్లో, కూడళ్లలో ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ పనులను స్థానిక సర్పంచ్ ప్రతినిధి వాసు, ఉప సర్పంచ్ మాడుగుల భాను, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, రమణయ్య, శ్రీనివాసరావు, రామారావు, రాజమోహనరావు మాస్టర్ పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం మర్రిపాడు పంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టారు. అన్ని వీధుల్లో కాలవుల్లోని పూడికలు తీయించి, ముళ్ల పొదలు తొలగించారు. పంచాయతీ సర్పంచ్ అట్టాడ కల్పనా రాంప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ పర్యవేక్షించారు. కార్యదర్శి చింత శ్రీను, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తారకేశ్వరరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులు


గోపాలరావు దంపతులు

ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మసంతృప్తి

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి పనిచేయడం ఎంతో ఆత్మసంతృప్తిని పొందవచ్చునని లైదాం ఎంపియుపి పాఠశాల ఉపాధ్యాయులు కూన గోపాలరావు అన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ గావించనున్న గోపాలరావు ప్రజాశక్తితో మాట్లాడారు. పొందూరు మండలం గోరింటకు చెందిన గోపాలరావు తల్లిదండ్రులు నారాయుడు, జోగలమ్మలు వ్యవసాయదారులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు. ఇందులో ఆరో సంతానంగా గోపాలరావు 1962 జూన్ 3న జన్మించారు.

విద్యాభ్యాసం

స్వగ్రామం గోరింట ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 3 వరకు, పొందూరు ప్రాథమిక పాఠశాలలో 4, 5 తరగతులు, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి, పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, విజయనగరం ఎంఆర్ కాలేజీలో డిగ్రీ, ఎచ్చెర్లలోని పి.జి.సెంటర్ (ప్రస్తుతం డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్శిటీ)లో ఎం.కాం, బి.ఎల్ పూర్తిచేశారు. అలాగే 1994లో అన్నామలై యూనివర్శిటీలో బిఇడి పూర్తిచేశారు.

ఉద్యోగ జీవితం

1998లో ఉపాధ్యాయునిగా ఎంపికై విశాఖపట్నం జిల్లా పెద్దబయలు మండలం సంపంగిపుట్టు(కె) ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరి సుమారు పదేళ్ల పనిచేశారు. 2008లో ఇచ్ఛాపురం మండలం డొంకూరు ప్రాథమిక పాఠశాలలో ఏడాదిన్నర పాటు పనిచేశారు. 2009లో సంతకవిటి మండలం జగన్నాథపేట పాఠశాలలో ఎనిమిదేళ్లు పనిచేశారు. 2017 ఆగస్టులో లైదాం ప్రాథమికోన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి 2024 జూన్ 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

ఉద్యమ నేపథ్యం

ఉపాధ్యాయ సంఘాలతో కలిసి పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈయన పిఆర్‌టియు మెంబర్‌గాను, డిటిఎఫ్‌లో సీనియర్ సభ్యునిగా ఉంటూ ఉద్యమాల్లో పాల్గొన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

సంతృప్తిపర్చిన అంశాలు

అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండడంతో విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల తర్ఫీదు ఇవ్వడం, యోగాలో నిష్ణాతులు కావడంతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, జ్యోతిష్యశాస్త్రంలో ప్రావీణ్యం, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం, వ్యవసాయం పట్ల మక్కువతో నూతన వంగడాలతో తనదైనశైలిలో సాగు చేయడంతో పాటు ఎక్కువకాలం విద్యార్థులతో గడపడం ఎంతో సంతృప్తి నిచ్చిందని తెలిపారు.

కుటుంబ నేపథ్యం

1992లో వెంకటరత్నంతో వివాహం కావడంతో తన దాంపత్య జీవితం ప్రారంభమైంది. తనకు ఒక్క కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో కుమారుడు సోమశేఖర్ సిఎ చదివారు. పెద్ద కుమార్తె మోహనలక్ష్మి బీఎస్సి పూర్తిచేయగా, చిన్న కుమార్తె లక్ష్మీప్రసాద్ సిఎ(సిఎల్) చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం తన శేష జీవితాన్ని స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ గడుపుతానని తెలిపారు.